క్లుప్తంగా

ఐదో రోజుకు దీక్షలు



దీక్షలో కూర్చున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బోథ్: ఎస్సీ వర్గీకరణ అంశంలో సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి అసెంబ్లీలో శాస్త్రీయంగా చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చేస్తున్న దీక్షలు ఆదివారం ఐదో రోజుకు చేరుకున్నాయి. దీక్షలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కుడాల స్వామి, నడికుంట సుభాష్, ఎడ్ల దశరథ్, బిక్క రమణయ్య, బీసీ సంఘం నేతలు కొండ కిష్టయ్య, గోలి పోశెట్టి, కామాజీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన



కలశపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

సిరికొండ: మండలంలోని పొన్న గ్రామంలో హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో ఆదివారం వేద పండితుల వేద మంత్రోచ్చారణలతో విగ్రహ ప్రతిష్ఠాపన, కలశపూజ నిర్వహించారు. ఈ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

వంజరి సంఘం కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

బోథ్: బోథ్ పట్టణ వంజరి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బోథ్ పట్టణ నూతన అధ్యక్షుడిగా కరిపే శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కనుకంటి రమేశ్, ప్రధాన కార్యదర్శిగా దోనగిరి రాజు, కోశాధికారిగా దోనగిరి చరణ్, సభ్యులుగా నామెడ శేఖర్, కరిపే వినోద్, లండేరి నారాయణ, లండేరి రవి, కాలేరి సంతోష్‌లను ఎన్నుకున్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న అభిలాష్, కుటుంబసభ్యులు

బోథ్: సోనాల మండల కేంద్రానికి చెందిన ఇర్ల అభిలాష్ తన కుమారుడు అగ్రజ్ మొదటి పుట్టినరోజు సందర్భంగా నిర్మల్‌లోని వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు.

పేదలకు సరుకులు పంపిణీ



సరుకులు అందజేస్తున్న సొసైటీ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: రంజాన్ మాసం పురస్కరించుకొని దారుల్ అన్సార్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం సరుకులు పంపిణీ చేశారు. రూ.1500 విలువ గల రేషన్ సరుకుల ప్యాకెట్లను 70 మంది పేద ముస్లింలకు అందజేశారు. సొసైటీ నాయకుడు ఖాజి నజీమొద్దీన్, హాఫిజ్ ఆరీఫ్ ఖాన్, మహ్మద్ వసీమ్, మహ్మద్ రొషన్, మొయిజ్, అజ్జు తదితరులు పాల్గొన్నారు.

తేజశ్రీరెడ్డికి సన్మానం



తేజశ్రీరెడ్డి దంపతులను సన్మానిస్తున్న మౌనిష్ రెడ్డి

తలమడుగు: తేజశ్రీరెడ్డిని ఆదర్శంగా తీసుకొని యువత ఉన్నత చదువులు చదవాలని సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని సుంకిడి గ్రామంలో ఇటీవల గ్రూప్ 2, గ్రూప్ 3లో ఉద్యోగం సాధించిన తేజ శ్రీరెడ్డి, జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించిన కార్తీక్‌లను ఘనంగా సన్మానించారు. రాకేశ్, హరీశ్ రెడ్డి, రాహుల్ రెడ్డి, శేఖర్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, దినేశ్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రఘు, తదితరులు ఉన్నారు.

అడవిలో గొడ్డలి చప్పుడు



- జిల్లాలో మళ్లీ మొదలైన కలప స్మగ్లింగ్
- భారీగా టేకు చెట్ల నరికివేత
- సరిహద్దులు దాటుతున్న కలప
- మొక్కుబడిగా ఫారెస్ట్ పెట్రోలింగ్



సిరిచెల్మ అటవీ ప్రాంతంలో నరికివేతకు గురైన టేకు చెట్లు (ఫైల్)

ఇచ్చోడ: అడవుల ఆదిలాబాద్ జిల్లాలో మళ్లీ స్మగ్లర్ల అలజడి మొదలైంది. నాలుగేళ్లుగా స్తబ్ధతగా ఉన్న స్మగ్లర్లు అడవులపై తమ పంజా విసురుతున్నారు. దట్టమైన అడవుల్లో వృక్షాలపై గొడ్డలి వేటు పడుతోంది. జిల్లా సరిహద్దులోని దట్టమైన అటవీ ప్రాంతాల్లో టేకు చెట్లను నరికి సైజులుగా మార్చి తరలించుకుపోతున్నారు. అటవీ సిబ్బంది, అధికారులు మొక్కుబడిగా పెట్రోలింగ్ చేయడంతో పాటు దట్టమైన అడవుల్లో చెట్ల నరికివేత బయటకు రాకుండా చూస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఆరేళ్ల క్రితం కలప స్మగ్లింగ్‌పై అప్పటి ప్రభుత్వం కఠినంగా వ్యవహరించింది. కలప స్మగ్లర్లపై పీడీ యాక్టులు నమోదు చేయాలని ఆదేశించింది. దీంతో కలప స్మగ్లింగ్‌కు బ్రేక్ పడింది. గత సంవత్సర కాలం నుంచి అడవుల్లో మళ్లీ గొడ్డళ్ల చప్పుడు విన్పిస్తోంది. జిల్లా సరిహద్దులోని దట్టమైన అటవీ ప్రాంతంలో గల టేకు చెట్లపై స్మగ్లర్లు కన్నేశారు. రాత్రివేళలో చెట్లను నరికి సైజులుగా మార్చి గుట్టు చప్పుడు కాకుండా తరలిస్తున్నారు.

మొక్కుబడిగా పెట్రోలింగ్..

అటవీశాఖ అధికారులు మొక్కుబడిగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. యూనిఫాం డ్యూటీలో 24 గంటల పాటు అప్రమత్తంగా ఉండాల్సిన అధికారులు ఆఫీస్ డ్యూటీలా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధుల్లో ఉంటున్నట్లు విమర్శలు విన్పిస్తున్నాయి. బీట్, సెక్షన్ అధికారులు తమ పరిధిలో ఉన్న అటవీ ప్రాంతాల్లో కాలినడకన పెట్రోలింగ్ నిర్వహించాలి. అటవీ సంపద రక్షణ కోసం తరచూ జాగ్రత్తలు తీసుకోవాలి. కానీ కేవలం రోడ్ల వెంట మాత్రమే సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. అటవీ ప్రాంతంలో నిఘా పెట్టకపోవడంతో స్మగ్లర్లు తమ పనిని సునాయాసంగా కొనసాగిస్తున్నారు. విలువైన కలప రవాణా నివారించడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడంలేదని ఆ శాఖపై విమర్శలు ఉన్నాయి.

కొరవడిన నిఘా..

అక్రమ కలప రవాణా అడ్డుకునేందుకు ఇచ్చోడ మండలంలోని మాన్కపూర్, సిరికొండ మండలంలోని పొన్న ఎక్స్‌రోడ్డు వద్ద రెండు ఫారెస్ట్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. సిరిచెల్మ, సిరికొండ అటవీ ప్రాంతాల నుంచి కలపను తరలించాలంటే ఈ చెక్‌పోస్టులు దాటి వెళ్లాల్సి ఉంటుంది. కానీ స్మగ్లర్లు చెక్‌పోస్టుల కళ్లుగప్పి కలపను తరలిస్తున్నారు. చెక్‌పోస్టుల వద్ద నిఘా కొరవడడంతోనే కలపను స్మగ్లర్లు జిల్లా సరిహద్దులు దాటిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

పనితీరుకు నిదర్శనం

గత వారం రోజుల క్రితం సిరిచెల్మ అటవీప్రాంతంలో స్మగ్లర్లు భారీగా టేకు చెట్లను నరికి కలపను తరలించారు. టేకు చెట్లు నరికిన ప్రాంతానికి సమీపంలో సిరిచెల్మలో టైగర్‌జోన్ క్యాంప్ కార్యాలయం, మరి కొద్దిదూరంలో బేస్ క్యాంప్ ఉంది. అయినా అధికారుల కళ్లుగప్పి కలపను తరలించారంటే అటవీ అధికారుల పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఇటీవల జిల్లాలో చోటుచేసుకున్న పలు సంఘటనలు..

- జనవరి 5వ తేదీన ఇచ్చోడ మండలంలోని కేశవపట్నం గ్రామంలో తనిఖీలు నిర్వహించి రూ.3.50 లక్షల కలపను స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో అటవీ అధికారులపై కేశవపట్నం మూల్తానీలు దాడిచేశారు.
- జనవరి 7న ఇచ్చోడ మండలంలోని గుండాలలో ఫారెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి రూ.50 వేల విలువ గల కలపను స్వాధీనం చేసుకున్నారు.
- మార్చి 4న సిరిచెల్మ అటవీప్రాంతంలోని ఫకీర్‌పేట్ వద్ద రూ.2 లక్షల విలువల గల టేకు చెట్లను నరికి స్మగ్లర్లు తరలించారు.

కలప స్మగ్లింగ్ కట్టడికి చర్యలు

కలప స్మగ్లింగ్ కట్టడికి చర్యలు తీసుకుంటున్నాం. రాత్రివేళలో పెట్రోలింగ్ చేపట్టి, సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం. ఫకీర్‌పేట్ ప్రాంతంలో జరిగిన టేకు చెట్ల నరికివేతపై విచారణ చేపట్టి అక్కడి ఫారెస్ట్ బీట్ అధికారిని సస్పెండ్ చేశాం. టేకు చెట్లు నరికిన స్మగ్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– రేవంత్ చంద్ర, ఎఫ్‌డీవో, ఉట్నూర్

ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలి



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతి విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మివాడ ఉన్నత పాఠశాలలో సరస్వతి శిశుమందిర్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలంటే భయపడొద్దని, ప్రణాళికబద్ధంగా చదివితే అనుకున్న లక్ష్యం సులువవుతుందన్నారు. కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. మహేందర్, జైపాల్ రెడ్డి, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు



డ్రంకెన్‌డ్రైవ్ పరీక్ష చేస్తున్న ఎస్సై శివరాం

సిరికొండ: వాహనదారులు మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై శివరాం హెచ్చరించారు. మండలంలోని కొండాపూర్ శివారులో ఆదివారం సాయంత్రం డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. కానిస్టేబుళ్లు తెలంగ్‌రావు, అర్జున్, మదన్ పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ



కొత్తూరులో సీసీరోడ్డుకు భూమిపూజ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

తలమడుగు: మండలంలోని కొత్తూరు గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో రూ.3లక్షలతో సీసీరోడ్డు పనులకు ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు భూమిపూజ చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ మండల కన్వీనర్ వెంకటేశ్ మాట్లాడుతూ బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ఆదేశాల మేరకు గ్రామంలో ఎన్‌ఆర్ ఈజీఎస్ పథకంలో సీసీరోడ్డు, మురికి కాలువలు నిర్మించనున్నట్లు తెలిపారు. నాయకులు అబ్దుల్లా, అశన్నయాదవ్, ప్రకాశ్, కిరణ్ కుమార్, పల్లవి, కిషన్, అభిరామ్, రమాకాంత్ పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట



చెక్కు అందచేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: కడెం మండలంలోని లక్ష్మీనగర్ గ్రామానికి చెందిన సొగ్గల సుధాకర్‌కు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు రూ.45 వేల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆదివారం ఉట్నూర్ క్యాంప్ కార్యాలయంలో అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పని చేస్తోందన్నారు. ఆపద సమయంలో సీఎంఆర్‌ఎఫ్ పేదలకు ఆర్థికంగా ఎంతో తోడ్పాటును అందిస్తుందని పేర్కొన్నారు. పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకార్ రెడ్డి, జిల్లా నాయకులు దాసండ్ల ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

స్వయం ఉపాధికి రుణాలు

- నేటి నుంచి దరఖాస్తుల ఆహ్వానం



ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం కింద నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించనుంది. అందులో భాగంగానే సోమవారం నుంచి ఏప్రిల్ 5 వరకు అర్హులైన ఎస్టీ, బీసీ అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఎస్సీ, మైనార్టీ అభ్యర్థుల నుంచి సైతం త్వరలో దరఖాస్తులు స్వీకరించే ప్రకటన జారీ చేస్తామని ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు పేర్కొన్నారు.

రెండేళ్ల తర్వాత అవకాశం..

2023–24 ఆర్థిక సంవత్సరంలో సుమారు 12వేలకు పైగా దరఖాస్తులు రాగా ప్రభుత్వం బీసీ అభివృద్ధి శాఖ ద్వారా జిల్లాలో 1,212 మంది లబ్ధిదారులకు రూ.12.12 కోట్ల వ్యయంతో రుణాలు అందజేసింది. ఇదిలా ఉండగా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళిత బంధు పథకం పేరుతో నియోజకవర్గానికి 100 యూనిట్ల చొప్పున ఒక్కొక్క లబ్ధిదారునికి రూ.10 లక్షల రుణాన్ని అందజేసింది. అనంతరం యూనిట్ల సంఖ్య పెంచిన్నప్పటికీ అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో యూనిట్ల పంపిణీ నిలిచిపోయింది. ప్రభుత్వం నిరుద్యోగ యువతకు సుమారు రెండేళ్ల అనంతరం సబ్సిడీ రుణాలు అందజేయనుండడంతో లబ్ధిదారులు వందల సంఖ్యలో దరఖాస్తు చేసుకునే అవకాశం లేకపోలేదు. అయితే వివిధ స్థాయిలో చదువుకుని ఉన్న యువతకు మాత్రమే అవకాశం కల్పిస్తారా.. అందరికి అవకాశం కల్పిస్తారా అనే దానిపై పూర్తి స్థాయిలో స్పష్టత రావాల్సి ఉంది.

పేదింటి బిడ్డ వివాహానికి చేయూత



పుస్తె,మట్టెలు అందిస్తున్న దాతలు

కడెం: పేదింటి యువతి వివాహానికి పుస్తె, మట్టెలు అందించి పలువురు పెద్దమనసు చాటుకున్నారు. మండలంలోని ఉడుంపూర్ పంచాయతీ పరిధిలోని గండిగోపాల్‌పూర్ గ్రామానికి చెందిన చంద్రశేఖర్–దేవక్క దంపతుల కూతురు సుమలత వివాహం ఆదివారం జరుగగా.. ఉడుంపూర్ మాజీ సర్పంచ్ జొన్నల సావిత్రి–రాజయ్యగుప్తా దంపతులు, కాంగ్రెస్ నాయకుడు జొన్నల చంద్రశేఖర్‌గుప్త పుస్తె, మట్టెలు, చీర, గాజులు అందించారు. అనంతరం వధువరూలను ఆశీర్వదించారు. కార్యక్రమంలో దొంతుల శ్రీనివాస్, లింగన్నయాదవ్, కొట్టి రాజన్న, నర్సింహశాస్త్రి, గ్రామపెద్దలున్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న జిల్లా అధ్యక్షుడు

ఖానాపూర్: మండలంలోని బీర్నంది గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు ఎనగందుల రవి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితీశ్ రాథోడ్ ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గడ్డం రవీందర్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

‘ఉపాధి’ కష్టాలు..!

- పని ప్రదేశంలో సౌకర్యాల కొరత
- అందుబాటులో ఉండని మెడికల్ కిట్
- నీడ, తాగునీటికి సైతం తిప్పలు



పనులు చేస్తున్న ఉపాధిహామీ కూలీలు

నేరడిగొండ: ఎండ తీవ్రత రోజురోజుకూ పెరుగుతుంది. ఉదయం 8 గంటల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఇలాంటి తరుణంలో మట్టి పనులు చేయడం ఉపాధిహామీ కూలీలకు కష్టసాధ్యంగా మారింది. పైగా పని ప్రదేశాల్లో నీడ సౌకర్యం ఉండటం లేదు. ఎవరికి వారే తాగునీటి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అత్యవసర మెడికల్ కిట్లు కూడా అందుబాటులో లేకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో లక్ష 67వేల పైచిలుకు జాబ్‌కార్డులు ఉండగా 3లక్షల 38వేలకు పైగా కూలీలు ఉపాధిహామీ పనులకు వెళ్తున్నారు.

గతంలో సౌకర్యాలు..

ఉపాధిహామీ పథకంలో గతంలో ఫిబ్రవరి నుంచి మే వరకు కూలీలు చేసిన పనికి 30 శాతం అదనపు భత్యం చెల్లించేవారు. ప్రయాణ, కరువు భత్యం (టీఏ, డీఏ) ఖర్చు కింద గడ్డపారకు రూ.10, తట్టకు రూ.5, మంచినీటికి రూ.5, ఐదు కిలోమీటర్లకు పైగా దూరం నుంచి వచ్చేవారికి రూ.20 చొప్పున చెల్లించేవారు. వీటితో పాటు పని ప్రదేశంలో నీడ సౌకర్యం కల్పించి విశ్రాంతి తీసుకునేలా చూసేవారు. రెండేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం వీటన్నింటిని నిలిపివేయడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు.

ఎదురయ్యే సమస్యలు..

ఎండలో ఎక్కువ సమయం పనిచేయడం ద్వారా కూలీలకు వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. పని ప్రదేశంలో తాగునీరు సరిపడా లేకపోవడంతో నీరసం, డీహైడ్రేషన్ వంటి సమస్యలు ఎదురవుతాయి. మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. నీడ సౌకర్యం లేకపోవడంతో కూలీలు శారీరకంగా బలహీనమవుతారు. ఎండల ద్వారా చర్మ సమస్యలు, అలసట, తలనొప్పి వంటివి ఎదురవుతాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ఉపాధి పనులకు వెళ్లే కూలీలు తగినంత నీరు తాగాలి. శరీరం డీహైడ్రేషన్ కాకుండా చూసుకోవాలి. పని ప్రదేశాల్లో ఓఆర్‌ఎస్, నిమ్మరసం ఉండేలా జాగ్రత్తలు పాటించాలి.
- ఎండలు తీవ్రంగా ఉన్నప్పుడు మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు పనిచేయడం మానుకోవాలి. ఉదయం, సాయంత్రం పని చేయడం మంచిది.
- పని మధ్యలో చిన్న విరామం తీసుకోవాలి. శరీరం అలసిపోయినట్లు అనిపిస్తే నీడ చాటున కూర్చోవాలి.
- తలనొప్పి, మైకం, వాంతులు, చెమట ఆగిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణమే వైద్యులను సంప్రదించాలి. బాధిత వ్యక్తిని నీడ ప్రదేశంలోకి చేర్చి నీటితో శరీరాన్ని తుడవాలి.
- ఉప్పు, చక్కెర కలిపిన ఆహారం, పండ్లు తీసుకోవడం ద్వారా శరీరంలో శక్తి, లవణాలు నిల్వ ఉంటాయి.
- పని ప్రదేశానికి సమీపంలోని వైద్య కేంద్రం వివరాలు కలిగి ఉండాలి.

సౌకర్యాల కల్పనకు చర్యలు



పని ప్రదేశాల్లో కూలీలకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అవసరమైన మెడికల్ కిట్లను ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు నివేదించి తెప్పించుకోవాలని సిబ్బందిని ఆదేశించాం. పని ప్రదేశంలో నీడ, తాగునీటి సౌకర్యం సైతం కల్పించేలా చర్యలు చేపడుతున్నాం. – వసంత్‌రావు, ఈజీఎస్ ఏపీవో

తాగి నడిపితేనే రోడ్డు ప్రమాదాలు



బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్ష చేస్తున్న ట్రైయినీ ఎస్సై జుబేర్

లక్ష్మణచాంద: మద్యం తాగి వాహనాలు నడపడం ద్వారానే అధిక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ట్రెయినీ ఎస్సై జుబేర్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా అన్ని ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: మండలంలోని వైడూర్యపూరం (వడూర్) గ్రామంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదివారం పర్యటించారు. వివిధ కారణాలతో మృతిచెందిన పార్టీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. బొడిగే ఆదర్శ్ కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. అనంతరం దర్బతాండ గ్రామంలో పర్యటించి జాదవ్ రమేశ్ కంటి చికిత్స చేయించుకోగా పరామర్శించారు. బొందిడి గ్రామానికి చెందిన రాథోడ్ రమేశ్ ఆరోగ్య విషయం గురించి అడిగి తెలుసుకున్నారు.

నేటి నుంచి శనగ కొనుగోళ్లు

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీఎస్, నాఫెడ్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి శనగ పంట కొనుగోళ్లు చేపట్టనున్నట్లు పీఏసీఎస్ సీఈవో ధరంసింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్వింటాల్ శనగ పంటకు రూ.5650 ధర చొప్పున కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రంలో శనగ పంట అమ్మి మద్దతు ధర పొందాలన్నారు.

పొట్టి శ్రీరాములు జయంతి



పూలమాలలు వేస్తున్న నాయకులు

ఖానాపూర్: ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకు ఆమరణ నిరాహార దీక్ష చేసిన పొట్టి శ్రీరాములు జయంతిని ఆదివారం పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవిక్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భాషాప్రయుక్త రాష్ట్రం కోసం వారు చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో జితేందర్, రవీందర్, సతీశ్, రాజేందర్, సుధాకర్, ఆనంద్, అశోక్, లచ్చన్న తదితరులు ఉన్నారు.